క్లుప్తంగా

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఫర్టిలైజర్ దుకాణాల స్టాక్ రిజిస్టర్లను, నిల్వలను తనిఖీ చేశారు. దుకాణదారులు ప్రతి ఒక్కరూ తప్పకుండా రోజువారీ స్టాక్ వివరాలు నమోదు చేయాలని దుకాణ యజమానులకు సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలన్నారు.

వెలగని హైమాస్ట్ లైట్లు



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని బొగ్గుగుడిసె చౌరస్తా వద్ద హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. ప్రధాన చౌరస్తా వద్ద లైట్లు వెలగకపోవడంతో చీకట్లు అలుముకున్నాయి. దూర ప్రాంతాల నుంచి ప్రయాణం చేసే ప్రయాణికులు, వాహన చోదకులు చౌరస్తా వద్ద చిమ్మచీకటిని అనుభవిస్తున్నారు. హసన్‌పల్లి గ్రామ పంచాయతీ అధికారులకు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి హైమాస్ట్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెండు దూడల జననం



బాన్సువాడ రూరల్: దేశాయిపేట్ గ్రామానికి చెందిన పాడి రైతు గాండ్ల సాయిలుకు చెందిన ఆవు ఒకే కాన్పులో రెండు దూడలకు జన్మనిచ్చింది. కృత్రిమ గర్భధారణ ద్వారా ఇలా రెండు దూడలకు జన్మనివ్వడంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. గోపాల మిత్ర రాములు, నేలకంటి గంగాధర్‌లు ఆవుకు డెలివరీ చేశారు.

బయోసైన్స్ టాలెంట్ పరీక్షకు రెడ్డిపేట విద్యార్థిని



రామారెడ్డి: రాష్ట్ర స్థాయి బయోసైన్స్ టాలెంట్ పరీక్షకు రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని వర్ష ఎంపికైనట్లు హెచ్‌ఎం గోపాల్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన బయోసైన్స్ టాలెంట్ పరీక్షలో వర్ష ద్వితీయ స్థానాన్ని పొంది రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైనట్లుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గోపాల్ రెడ్డి, చిన్నస్వామి, సంతోష్, ఉపాధ్యాయులు వర్షను అభినందించారు.

'ఇంగ్లిష్ మాట్లాడటం చాలా తేలిక'



భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బ్రిటన్ యూనివర్సిటీకి చెందిన రీసెర్చ్ స్కాలర్ డాక్టర్ శాంభవి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఇంగ్లిష్ బోధన తరగతులను గమనించారు. ఇంగ్లిష్ మాట్లాడటం చాలా తేలిక అని, భయపడవలసిన అవసరం లేదని విద్యార్థులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రసూన దేవి, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు అనిల్, ఉపాధ్యాయుడు సురేందర్‌లు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

మాచారెడ్డి: పాల్వంచ మండలం బండ రామేశ్వరపల్లి గ్రామానికి చెందిన చినిగిరి రాజేష్ అనే విద్యార్థి ఇటీవల కరెంటు షాక్‌తో మృతి చెందాడు. శుక్రవారం రాజేష్ తల్లి దేవరాణికి విద్యుత్ శాఖ అధికారులు రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేశారు. ఎస్ఈ శ్రావణ్ కుమార్, డీఈ కల్యాణ చక్రవర్తి, ఏఈ జ్యోతి, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, పాల్వంచ మండల అధ్యక్షుడు తోట సాయిలు ఉన్నారు.

సరళ పద్ధతిలో గణిత బోధన చేయాలి

ఎల్లారెడ్డిరూరల్: విద్యార్థులకు సరళ పద్ధతిలో గణిత బోధన చేయాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈవో మాట్లాడారు. నూతనంగా గణిత ఉపాధ్యాయులుగా ఉద్యోగాలను సాధించిన వారిని సన్మానించారు. గణిత ఉపాధ్యాయులు శ్రీనివాస్, సిద్ది రామాగౌడ్, శ్రీనివాస్, ప్రియదర్శిని ఉన్నారు.

అటకెక్కిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

- మార్కెట్ నిర్మాణం పూర్తికాకపోవడంతో రోడ్లపైనే కూరగాయల విక్రయం
- మెదక్–రుద్రూర్ హైవే నిర్మాణం పూర్తయితే వీధిన పడనున్న చిరు వ్యాపారులు



రోడ్లపైనే విక్రయిస్తున్న కూరగాయల వ్యాపారులు



అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

ఎల్లారెడ్డి: చిరు వ్యాపారులతో పాటు, కూరగాయలు, పండ్లు, మాంసం తదితర వస్తువులన్నీ ఒకే చోట లభించేలా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించడానికి పనులు ప్రారంభించారు. దీని నిర్మాణానికి మున్సిపల్ నుంచి రూ.2 కోట్ల నిధులు కేటాయించినప్పటికి ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఏడాదిన్నర కావస్తున్నా ఇంత వరకు పనులు పూర్తి కాలేదు. ఎల్లారెడ్డి పట్టణంలో బస్టాండ్ ఎదురుగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం ప్రారంభించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి స్థలం లేకపోవడంతో బస్టాండ్ ఎదురుగా ఉన్న నీటిపారుదల శాఖ, రోడ్డు భవనాల శాఖ భవనాలను తొలగించి వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి ఇక్కడ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి స్థలం కేటాయించారు. నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పనులు పూర్తికాక పోవడంతో చిరు వ్యాపారులు ఇబ్బందుల పాలవుతున్నారు. రోడ్డుపై కూరగాయలు, పండ్లు విక్రయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీంతో పాటు మెదక్ నుంచి రుద్రూర్ వరకు హైవే నిర్మాణ పనులు జరుగుతుండడంతో రోడ్డుకు ఓ వైపు ఉన్న చిరు వ్యాపారులకు సంబంధించిన దుకాణాలు తొలగించనుండటంతో వీరికి మరింత ఇబ్బంది కలగనుంది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పనులు పూర్తయితే చిరువ్యాపారులకు ఉపాధి దొరుకుతుందని వ్యాపారులు భావిస్తున్నారు. అధికారులు స్పందించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

కామారెడ్డి టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు మాట్లాడుతూ.. 24 ఏళ్లుగా వైద్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నా.. ఇప్పటి వరకు క్రమబద్ధీకరించకపోవడం దారుణమన్నారు. వైద్య శాఖలో తమను భర్తీ చేసిన తర్వాతే మిగతా పోస్టులకు నోటిఫికేషన్, రాత పరీక్ష నిర్వహించాలని కోరారు. గతంలో తాము చేసిన సమ్మెకు స్పందించిన ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ఆ కమిటీ రిపోర్ట్ లేకుండా రెగ్యులర్ పోస్టుల భర్తీకి రాత పరీక్ష తేదీ ప్రకటించడం వెనకాల ఉన్న ఆంతర్యమేంటని ప్రశ్నించారు. తక్షణమే ఆ రాత పరీక్షను వాయిదా వేయకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు, యూనియన్ నాయకులు లక్ష్మి, రేణుక, సవిత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరకాలనీలో నీటి కష్టాలు



ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న ప్రజలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని వడ్డెర కాలనీ ప్రజలు మూడు రోజులుగా నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా ఉన్న బోరు చెడిపోవడంతో నీరు రావడం లేదంటూ పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. వరి నాట్లు వేసే తరుణంలో నీటి సమస్య ఏర్పడటంతో పనులకు వెళ్లలేక పోతున్నామంటూ స్థానికులు వాపోతున్నారు. ట్యాంకర్ ద్వారా నీటిని అధికారులు సరఫరా చేస్తున్నా..ఆ నీరు సరి పోవడం లేదంటూ వడ్డెరకాలనీవాసులు సమస్యను వివరిస్తున్నారు. సంబంధిత అధికారులు మేల్కొని చెడిపోయిన బోరు త్వరగా బాగు చేయించాలి లేదా కాలనీలో సింగిల్ ఫేజ్ బోరు వేయించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి..!



పెద్దశక్కర్గ దారిలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

మద్నూర్(జుక్కల్): మండలంలోని మారుమూల గ్రామాలకు వెళ్లే రహదారిపై మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. మూల మలుపుల వద్ద సంబంధిత శాఖాధికారులు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. పెద్ద శక్కర్గా గ్రామానికి వెళ్లే దారిలో చెట్లతో నిండిపోయి మూలమలుపు కనపడకుండా పోయింది. అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

కామెర్లతో బాలిక మృతి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేట గ్రామానికి చెందిన అలీనా(15) అనే బాలిక కామెర్ల వ్యాధితో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన అలీనాకు కామెర్లు రావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు వారు తెలిపారు. బాలిక మృతితో బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

'బల్దియా సామగ్రి చోరీ' ఫిర్యాదుపై విచారణ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్‌కు సంబంధించిన బోరు మోటార్లు, పైపులు, వైర్లు. ఇతర సామగ్రి భారీ మొత్తంలో దొంగతనం జరిగిందని పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌కు గురువారం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. స్పందించిన కమిషనర్ హెచ్‌ఎం స్పందన విచారణ చేపట్టాలని మున్సిపల్ డీఈ వేణుగోపాల్, ఎఫ్‌బీవో శ్యామ్‌లకు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. వాటర్‌వర్క్స్, బుర్రమత్తడి, గడి ట్యాంక్ వద్ద నుంచి తరలించిన సామగ్రికి సంబంధించి నూతన ఫిల్టర్ బెడ్ వద్ద అధికారులు విచారణ జరిపారు. నివేదికను కమిషనర్‌కు సమర్పించినట్లు డీఈ తెలిపారు. చోరీ జరగలేదని అధికారులు వివరణ ఇవ్వకుండా సామగ్రి మాత్రం ఉందని వివరణ ఇచ్చారు. అయితే ఇటీవలే కొందరు వ్యక్తులు 80 శాతం సామగ్రిని ఒక లారీ, బొలెరో వాహనంలో గుట్టుచప్పుడు కాకుండా తరలించి అమ్ముకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఫిర్యాదు చేసిన కౌన్సిలర్లు 2 రోజుల్లో సాక్ష్యాలతో సహా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిసింది. ఫిల్టర్ బెడ్ వద్దకు తరలించిన మొత్తం 12 ట్రాక్టర్ల సామగ్రి పూర్తిగా లేనట్లు తెలిసింది.

ఏఐఎస్ఎఫ్ నాయకుల ముందస్తు అరెస్టు

కామారెడ్డి టౌన్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ నిధులను విడుదల చేయాలని హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నా సందర్భంగా పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున జిల్లా నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ శివ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంతప్, జస్వంత్ తదితరులున్నారు.

మహిళా సంఘాల సభ్యులు తప్పనిసరిగా హాజరవ్వాలి



మాట్లాడుతున్న డీపీఎం సుధాకర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మహిళా సమాఖ్య ద్వారా నిర్వహించే సమావేశాలకు మహిళా సంఘాల సభ్యులు తప్పనిసరిగా హాజరవ్వాలని సెర్ప్ డీపీఎం సుధాకర్ సూచించారు. నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సమాఖ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మహిళా సంఘాల సమావేశాలకు హాజరవడం వల్ల కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. తెలుసుకున్న విషయాలను గ్రామాల్లోని మహిళలకు చెప్పాలన్నారు. దీంతోపాటు కొత్తగా పెళ్లి చేసుకొని గ్రామాలకు వచ్చే కోడళ్లను మహిళా సంఘాలలో చేర్పించాలని ఆయన సూచించారు. అలాగే మహిళాశక్తి పథకం కింద ఉపాధి పొందేలా సంఘ సభ్యులను ప్రోత్సహించాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షులు బేస్త శాంత, ఏపీఎం జగదీశ్, అకౌంటెంట్ రాజు, సీసీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పత్తి కొనుగోళ్లు



మద్నూర్(జుక్కల్): పత్తి మార్కెట్‌కు ప్రసిద్ధి చెందిన మద్నూర్‌లో పత్తి కొనుగోళ్లు జోరుగా కొనసాగుతున్నాయి. జిల్లాలో ఏకైక పత్తి కొనుగోలు కేంద్రం ఉండడంతో రైతులు పత్తిని మద్నూర్‌లోని సీసీఐ కేంద్రానికి తరలిస్తున్నారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి రైతులు పత్తిని మార్కెట్‌కు తరలించారు. గత నెలలో ప్రారంభమైన ప్రభుత్వ పత్తి కొనుగోలు కేంద్రంలో ఇంత వరకు 70 వేల క్వింటాళ్ల పత్తిని రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేశామని మార్కెట్ కమిటీ ఉద్యోగులు తెలిపారు. మరో రెండు నెలల వరకు పత్తి సీజన్ కొనసాగుతుందని వారు చెప్పారు.

వసతి గృహం వార్డెన్‌ను సస్పెండ్ చేయండి



బాన్సువాడ: పెద్దకొడప్‌గల్ బాలర వసతి గృహం వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని శుక్రవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి తెలంగాణ స్టూడెంట్ పరిషత్(టీఎస్‌పీ) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్‌పీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచినా వసతి గృహాల వార్డెన్ల నిర్లక్ష్యం వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని పేర్కొన్నారు. అందుకు నిదర్శనంగా పెద్ద కొడప్‌గల్ వసతి గృహంలో ఉడకని భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని అన్నారు. బాధ్యులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

విద్యార్థులతో వంట పనులు



బిచ్కుంద బాలుర హైస్కూల్‌లో భోజనం వడ్డిస్తున్న విద్యార్థులు

- నోరు మెదపని ఉపాధ్యాయులు

బిచ్కుంద(జుక్కల్): తమ పిల్లలు చదువుకొని ప్రయోజకులు అవుతారని ఎన్నో ఆశలతో తల్లిదండ్రులు పాఠశాలలకు పంపుతున్నారు. కానీ పాఠశాలల్లో వంట మనుషులకు సహాయం చేస్తూ చదువులను పక్కన పెడుతున్నారు. శుక్రవారం బిచ్కుంద బాలుర హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులతో వంట పనులు చేయించడం, భోజనం వడ్డించడం తదితర పనులు చేయిస్తూ 'సాక్షి'కి దర్శనమిచ్చారు. చదువుకోసం వచ్చిన విద్యార్థులకు పాఠశాలలో పనులు చేయించడం ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మీ కోసం వంటలు చేస్తున్నాం.. మీరే పనులు చేయాల్సి ఉంటుంది.. బయట ఎవ్వరికి చెప్పవద్దని ఉపాధ్యాయులు, నిర్వాహకులు విద్యార్థులను భయపెట్టినట్లు తెలిసింది. శుక్రవారం పాఠశాలలో కాంప్లెక్స్ స్థాయి ఉపాధ్యాయుల సమావేశం జరుగుతోంది. సమావేశానికి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులతో భోజన ఏజెన్సీవారు వెట్టిచాకిరి పనులు చేయిస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం గమనర్హం.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



బిచ్కుంద(జుక్కల్): పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా ఉపాధ్యాయులు ముందుకు వెళ్లాలని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బిచ్కుందలో బాలుర హైస్కూల్‌లో కాంప్లెక్స్ స్థాయి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు 90 రోజులు ప్రణాళిక రూపొందించుకొని సబ్జెక్టుల వారిగా సిలబస్ పూర్తి చేసి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. వ్యక్తిగత శ్రద్ధ పెట్టి విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించాలని సూచించారు.

మోడల్‌స్కూల్ హాస్టల్ తనిఖీ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్‌స్కూల్ హాస్టల్‌ను తహసీల్దార్ మహేందర్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. హాస్టల్‌లోని రికార్డులను తనిఖీ చేసిన అనంతరం విద్యార్థులకు వండిన భోజనం పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనంతో పాటు, హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండడం పట్ల తహసీల్దార్ హర్షం వ్యక్తం చేశారు. వార్డెన్ సుజాత తదితరులున్నారు.

పోలీసుల అదుపులో ఆటో జేఏసీ నేతలు



కామారెడ్డి అర్బన్: ఆటో జేఏసీ ఇచ్చిన చలో అసెంబ్లీ నిరసనకు కామారెడ్డి జిల్లా ఆటో జేఏసీకి ఎలాంటి సంబంధం లేదని చెప్పినా జిల్లా పోలీసులు తమను అక్రమంగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారని జిల్లా ఆటో జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోదాసు నర్సింలు మండిపడ్డారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా ఆటో జేఏసీ నాయకులను అదుపులోకి తీసుకోవడం విచారకమన్నారు. అక్రమ అరెస్ట్ చేసి ఉద్యమాలను అడ్డుకోలేరని, జిల్లాలో ఆటో కార్మికుల జేఏసీ భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నట్టు తెలిపారు.

సమాచారం..

నేడు ఎల్లారెడ్డికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రాక

ఎల్లారెడ్డి: మండలంలో పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరుకానున్నట్లు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు విద్యుత్ శాఖ తరపున మంజూరైన చెక్కులను అందించనున్నట్లు వారు తెలిపారు.

మైనారిటీ మహిళలకు స్వయంఉపాధి శిక్షణ

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మైనారిటీ కార్పొరేషన్ అజ్మీరి సొసైటీలో స్వయం ఉపాధి కింద మూడు నెలల ఉచితకుట్టు, బ్యూటీషియన్ శిక్షణ కోసం అర్హులైన మైనారిటీ మహిళలు ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ జిల్లా అధికారి టి.దయానంద్ తెలిపారు. దరఖాస్తుదారుల వయస్సు 18 నుంచి 35 లోపు ఉండాలని, అలాగే పదవ తరగతి లోపు చదువుకొని ఉండాలని అన్నారు. వివరాలకు కలెక్టరేట్‌లోని 222 నంబర్ గదిలో లేదా 80969 73346 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా బంద్

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు మల్లుపల్లి, ఇసన్నపల్లి, భాగిర్తిపల్లి, కంచర్ల జంగంపల్లి, రామేశ్వర్‌పల్లి, కాచాపూర్, పెద్దమల్లారెడ్డి, అయ్యవారిపల్లి గ్రామాల్లో నేడు 2 గంటల పాటు విద్యుత్ సరఫరా బంద్ ఉంటుందని ట్రాన్స్‌కో కామారెడ్డి డివిజనల్ ఇంజనీర్ కల్యాణ్ చక్రవర్తి శుక్రవారం తెలిపారు. భిక్కనూరు మండల కేంద్రంలోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో బస్‌బార్ మరమ్మతులు నిర్వహిస్తున్నందున మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

14 వరకు ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాలు

కామారెడ్డి అర్బన్: ధనుర్మాసం సందర్భంగా స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఏక పంచాశ ధనుర్మాస వ్రతోత్సవాలు, తిరుప్పావై ప్రవచనాలు జనవరి 14 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ప్రతి రోజు ఉదయం 7.15 నుంచి 8.30 గంటల వరకు సామూహిక గీతా పారాయణం, అర్చకులు గుండి రంగాచార్యులు, కంజర్ల మధు, కంజర్ల నరేందర్‌లతో తిరుప్పావై పారాయణం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ పేర్కొంది.

సంక్షిప్తం

చైర్ పర్సన్‌తో మున్సిపల్ కమిషనర్ భేటీ



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా విధుల్లో చేరిన హెచ్‌ఎం. స్పందన శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. పట్టణ సమస్యలపై కాసేపు చర్చించారు. పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, గోనె శ్రీనివాస్, పంపరి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): విద్యార్థులు ప్రతిరోజు పాఠాలను ఏకాగ్రతతో చదవాలని తెలంగాణా సాధు పరిషత్ ప్రచార కార్యదర్శి కృష్ణానందస్వామి అన్నారు. బ్రాహ్మణపల్లిలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ధ్యాన యోగ శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మనశ్శాంతి కలగాలంటే ప్రపంచ చింతలను వదిలేయాలని సూచించారు. ఉపాధ్యాయులు రమేష్, బాలునర్సయ్య, సురేష్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు



దోమకొండ: జిల్లా కేంద్రంలో సీఎం కప్ కరాటే పోటీలను నిర్వహించగా, దోమకొండ మండల కేంద్రానికి చెందిన 13 మంది రాష్ట స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను మాజీ జెడ్పీటీసీ తిగల తిర్మల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శంకర్‌రెడ్డితో పాటు కరాటే కోచ్ రాజయ్యలు అభినందించారు. గ్రామానికి చెందిన సుశాంక్, వంశీ, విద్వత్ గౌడ్, రాజేష్, సుభాష్, రాజు, నిఖిల్, రోహిత్, శాన్విత, శ్రీలేఖ, భవ్యశ్రీ, శ్రీనిజలు ఎంపికయ్యారు.

ఎమ్మెల్యేకు మంత్రి పదవి రావాలని పాదయాత్ర

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు మంత్రి పదవి రావాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా పాదయాత్ర చేశారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ జొన్నల రాజు, నాయకులు ఎల్లమయ్య, సాయికుమార్, మాకం రాములు, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రవచనాలు

కామారెడ్డి టౌన్: ధనుర్మాస వ్రతోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో కొనసాగుతున్న ప్రవచనాలు జనవరి 14 వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు మధు, నరేందర్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీమాన్ గుండి రంగాచార్యులతో నిత్యం ప్రవచనాలతో పాటు ప్రత్యేక విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.